క్లుప్తంగా

హైస్కూల్ మార్పునకు అనుమతించాలని వినతి



గానుగపాడు(తిరువూరురూరల్): మండలంలోని గానుగపాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పక్కా భవనాల నిర్మాణం పూర్తయినందున తరగతుల ప్రారంభానికి అనుమతించాలని ఆ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సోమవారం తిరువూరు ఎంపీడీవో రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జెడ్పీ హైస్కూల్ తరగతులు జరుగుతున్నాయని, ఎంపీపీ స్కూల్‌ను కొత్త విద్యావిధానంలో మోడల్ స్కూలుగా మార్పు చేసినందున ఉన్నత పాఠశాలను కొత్త భవనంలోకి మార్పు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సత్యం, జమలయ్య, చినవెంకటరత్నం ఉన్నారు.

ఆలయానికి ఇత్తడి గద వితరణ



తిరువూరు: స్థానిక పాటిమీద దాసాంజనేయస్వామి దేవస్థానానికి ఇత్తడి గదను స్థానాచార్యులు ఎన్‌సీహెచ్ విఠలాచార్యులు సోమవారం అందజేశారు. భక్తుల అనారోగ్య బాధలు తొలగిపోవటానికి, భయాందోళనలు, పీడకలలు, చికాకుల నివారణకు స్వామివారి దివ్యమంత్రాలతో మంత్రించి తయారుచేయించిన ఇత్తడి గదతో భక్తులను తాకితే సర్వబాధలు తొలగిపోతాయని ఆలయ అర్చకులు పార్థసారథాచార్యులు తెలిపారు.

హీల్ సేవలు అభినందనీయం



ఆగిరిపల్లి: పుట్టుకతో, ప్రమాదంలో గాని అంగవైకల్యం పొందిన దివ్యాంగులకు హీల్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర అకాడమిక్ అడిషనల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తోటపల్లిలో సోమవారం హీల్ సంస్థలో దివ్యాంగుడికి ఆయన కృత్రిమ కాలును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాథలైన చిన్నారులకు ఉచిత విద్య, వసతి కల్పించడంతో పాటు అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపి, కంప్యూటర్ విద్య అందించడం ద్వారా వారిని సమాజంలో స్వయంశక్తిగా ఎదగడానికి కృషి చేస్తున్న హీల్ సంస్థ చేస్తున్న సేవలందరికీ ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో హీల్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, సీనియర్ టెక్నీషియన్ చిన్నా, సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తిపరమైన వ్యాధులను అధిగమించాలి



ఇబ్రహీంపట్నం: ఉద్యోగులకు వృత్తిపరంగా సంభవించే వ్యాధులను అధిగమించాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ శివ రామాంజనేయులు తెలిపారు. ఎన్టీటీపీఎస్‌లో ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం, సంపూర్ణ పోషకాహారం తీసుకోవడం, ఒత్తిడిని దూరం చేయడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. ఇటువంటి వైద్య శిబిరాల ద్వారా మనకు తెలియని వ్యాధులు బయటపడితే పూర్తిస్థాయి వైద్యం తీసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. 550 మంది ఉద్యోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

30న నూజివీడులో జాబ్‌మేళా

నూజివీడు: స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో ఈనెల 30న జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో 13 కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పీజీ, ఇంజినీరింగ్ అర్హత కలిగిన అభ్యర్థులు తమ అర్హతకు సంబంధించిన సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి క్రీడా శిబిరాలు కళకళ

- ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు



బాస్కెట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు

నూజివీడు: వేసవి సెలవులు వచ్చాయంటే చిన్నారులు సంతోషంతో గంతులేస్తారు. ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు.. వేసవి సెలవులను ఆటవిడుపుగా భావిస్తారు. తమకు నచ్చిన ఆటలో శిక్షణ పొందుతూ క్రీడల్లో మెలకువలు నేర్చుకుంటారు. చిన్నారుల తాకిడితో ఈ ఏడాది కూడా క్రీడా శిక్షణ శిబిరాలు కళకళలాడుతున్నాయి. క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నూజివీడులో వేసవి క్రీడా శిబిరాలను నిర్వహిస్తున్నారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగిన చిన్నారులకు వేసవి శిక్షణా శిబిరాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. సెల్‌ఫోన్‌లకు, టీవీలకు అతుక్కుపోకుండా చిన్నారులు క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. విలువైన సమయాన్ని వృథా చేయకుండా తమకు ఇష్టమైన ఆటలపై దృష్టి పెట్టి మెలకువలు నేర్చుకుంటున్నారు. శారీరక, మానసిక ధారుఢ్యానికి ఈ శిబిరాలు దోహదపడుతున్నాయి. ఈ శిబిరాల్లో తమకు నచ్చిన అంశాలను నేర్చుకోవడంపై చిన్నారులు ఆసక్తిని కనబరుస్తున్నారు. పట్టణంలోని విక్టోరియా పురమందిరం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్‌లలో వేసవి క్రీడా శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. జిల్లా క్రీడాప్రాధికారసంస్థ ఆధ్వర్యంలో ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన శిక్షణ శిబిరం నెలాఖరు వరకు కొనసాగుతోంది. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. కోచ్ వాకా నాగరాజు శిక్షణలో చిన్నారులు బాస్కెట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడల్లో మెలకువలు నేర్చుకుంటున్నారు.

120 మంది చిన్నారులకు శిక్షణ

బాస్కెట్‌బాల్‌కు జిల్లాలోనే అత్యధిక ఆదరణ నూజివీడులో ఉన్న నేపథ్యంలో ఇక్కడ మే 31 వరకు నిర్వహిస్తున్న ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో చిన్నారులు వచ్చి శిక్షణ పొందుతున్నారు. ఏడు నుంచి 17 ఏళ్లలోపు 120 మంది చిన్నారులు ఈ శిబిరంలో బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్లలో రాణించడానికి అవసరమైన మెలకువలన్నింటినీ నేర్చుకుంటున్నారు. ముఖ్యంగా ప్రాథమిక అంశాలను వివరిస్తున్నారు. ఏ క్రీడకైనా శరీర పటుత్వం ముఖ్యం కావడంతో ప్రతి రోజూ ముందుగా పిల్లలతో జాగింగ్, వ్యాయామం చేయించిన తరువాత శిక్షణ మొదలవుతుంది. బంతిని పట్టుకుని పరిగెత్తడం, బాస్కెట్‌లో వేయడం, బాస్కెట్‌బాల్‌లో నిబంధనలు, ఇతర మెలకువలను చిన్నారులకు వివరిస్తూ ఆటను నేర్పుతున్నారు. వీరికి వ్యాయామోపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు, బాస్కెట్‌బాల్ కోచ్ వాకా నాగరాజు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. పలువురు బాస్కెట్‌బాల్ సీనియర్ క్రీడాకారులను కూడా ఈ శిక్షణ శిబిరానికి తీసుకువచ్చి ఆటలోని మెలకువలను గురించి పిల్లలకు నేర్పిస్తున్నారు. పలువురు పీఈటీలు తమ తోడ్పాటును అందిస్తున్నారు. బాస్కెట్‌బాల్‌తో పాటు వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్‌లో శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి.

వ్యాయామంతో పాటు మెలకువలు నేర్పుతున్నాం



వేసవి సెలవులను వృథాగా గడిపే కంటే ఇష్టమైన ఆటలలో తర్ఫీదు పొందినట్లయితే ఎంతో ఉపయోగం ఉంటుంది. పిల్లల ఆసక్తిని బట్టి ఆయా క్రీడల్లో శిక్షణనిస్తున్నాం. చిన్నారులు చక్కగా నేర్చుకుంటున్నారు. ఆటల పట్ల వారిలో ఉన్న ఆసక్తి ఈ శిక్షణ ద్వారా మరింత పెరుగుతుంది. శారీరక ధారుఢ్యం కోసం రెండు పూటలా వ్యాయామం కూడా చేయిస్తున్నాం.

– వాకా నాగరాజు, కోచ్, నూజివీడు

ప్రయాణం.. ప్రమాదకరం



కోటపాడు తమ్మిలేరు వాగు వరదలో నడిచి వస్తున్న రైతులు (ఫైల్)

చాట్రాయి: వాగులో నడుచుకుంటూ వెళ్లడం ప్రమాదమని తెలిసినా అక్కడి వారికి ప్రయాణం తప్పని పరిస్థితి. తమ్మిలేరు వాగుకి వరద వస్తే మండలంలోని కోటపాడు, చింతలపూడి మండలం పోతునూరు ఆగ్రహారం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ వంతెన లేకపోవడంతో ప్రజలు వాగులోకి దిగి నడుచుకుంటూ వెళ్తున్నారు. కోటపాడు నుంచి చింతలపూడి నిత్యావసర వస్తువులు, ఆస్పత్రికి వెళ్లేందుకు వ్యవసాయ భూముల్లో పనులకు వెళ్లడానికి ఇదే దగ్గర మార్గం కావడంతో వారికి తమ్మిలేరు వాగులో నుంచి ప్రయాణం చేయక తప్పని పరిస్థితి. కానీ వర్షాకాలంలో ఒక్కసారిగా వరద పెరిగిన సందర్భాల్లో గతంలో ఓ వ్యక్తి, కొన్ని పశువులు కొట్టుకుపోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. తమ్మిలేరు వాగుపై వంతెన లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్



అర్జీని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. గడువులోగా అర్జీలకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. ఒక వేళ గడువులోగా సమస్యను పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి 15 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, డీఎల్‌పీఓ సుందరి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, హెచ్‌ఓ ఆర్ హేమ, విద్యుత్ ఏఈ ఏ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- ఆర్టీసీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు అర్జీ అందజేశారు.
- తమ ఇంటి సమీపంలో కొందరు పందులను పెంచుతున్నారని, దీనివల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి స్థానికులం అస్వస్థతకు గురవుతున్నామని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆగిరిపల్లి మండలం కనసానపల్లికి చెందిన జలసూత్రం నాగేశ్వరరావు అర్జీ అందజేశారు.
- నూజివీడు మండలం పోలసానపల్లిలో తనకు 20.62 ఎకరాల భూమి ఉందని, పాసుపుస్తకంలో మాత్రం 19.25 ఎకరాలు మాత్రమే నమోదు చేశారని, దీనిపై డివిజనల్ సర్వేయర్‌తో సర్వే చేయించాలని ఐ.విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు.
- తాను 8వ నెల గర్భిణినని, తనకు ఆరోగ్యశ్రీ కార్డు లేదని, ఈ పరిస్థితుల్లో కార్డు అవసరం ఎంతో ఉన్నందున తనకు ఆరోగ్యశ్రీ కార్డు ఇప్పించాలని కోరుతూ ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్లకు చెందిన డొక్కు కృష్ణవేణి అర్జీ అందజేసింది.

మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రారంభం



ఇబ్రహీంపట్నంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న శరత్‌కుమార్, డెప్యూటీ డీఎంహెచ్ఓ ఇందుమతి

ఇబ్రహీంపట్నం: మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రత్యేక కార్యక్రమం ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభమైంది. జిల్లా వ్యాక్సినేషన్ అధికారి డాక్టర్ శరత్‌కుమార్, డెప్యూటీ డీఎంహెచ్ఓ హిందుమతి వ్యాక్సినేషన్ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల్లో గవద బిళ్లల వ్యాధి నివారణ కోసం మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించాలని సూచించారు. వ్యాక్సిన్ అందకుండా ఏ ఒక్క చిన్నారి ఉండకూడదని వైద్య సిబ్బందికి తెలియజేశారు. తల్లిదండ్రులు ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉపయోగించుకుని చిన్నారులకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. మొదటి విడతగా ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్లు పర్వీన్, డాక్టర్ సుమంత్, సీహెచ్ఓ నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పక వేయించాలి

జి.కొండూరు: రెండేళ్లలోపు పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్‌ను తప్పక వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నరాణి అన్నారు. వ్యాక్సినేషన్ ప్రక్రియపై వైద్య సిబ్బందికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రసన్నరాణి మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి జూలై 31వ తేదీ వరకు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. చిన్నారులకు గవద బిళ్లలు, రూబెల్లా వ్యాధి సోకకుండా ఈ వ్యాక్సిన్ రక్షిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మేరీ సుగుణ, సూపర్‌వైజర్ అచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కటే దారి.. దారంతా బురద



బురదమయంగా జి.కొండూరు జగనన్న కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి

జి.కొండూరు: జి.కొండూరు జగనన్న కాలనీకి ఒక్కటే ప్రధాన రహదారి ఉంది. వర్షం పడితే ఈ రహదారంతా బురదమయమై కాలనీ వాసులు బయటకు రావాలంటే నరకయాతన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జి.కొండూరు గ్రామ శివారులోని 30వ నంబర్ జాతీయ రహదారికి మూడు వందల మీటర్ల దూరంలో రైతుల నుంచి భూమిని కొనుగోలు చేసి 374 ప్లాట్లుగా విభజించి పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఆ వెంటనే లబ్ధిదారులు 200కి పైగా ఇళ్ల నిర్మాణం చేపట్టగా కొన్ని నిర్మాణాలు పూర్తయి ఇప్పటికే 150 కుటుంబాల వరకు అక్కడ నివసిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులెవరూ ఈ కాలనీ వైపు కన్నెత్తి చూడకపోవడంతో రహదారులు బురదమయంగా మారి ఇక్కడ నివసిస్తున్న వారు అడుగు బయట పెట్టలేకపోతున్నారు. కాలనీలో అంతర్గత రహదారులు, డ్రెయినేజీలు, తాగునీటి సరఫరా లేకపోయినప్పటికీ నానా తంటాలు పడుతూ జీవిస్తున్నారు. అయితే కనీసం ప్రధాన రహదారినైనా అభివృద్ధి చేస్తే తమకు కొంత మేర ఇబ్బంది తప్పుతుందని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం: విద్యుత్ శాఖ మాసాంతపు మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ వెంకన్నబాబు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌తో పాటు 16, 17, 18, 19 వార్డులు, జగనన్న కాలనీలో విద్యుత్ నిలిపి వేస్తామన్నారు.

లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లారీ ఢీకొని వ్యక్తితో పాటు ఇద్దరు పిల్లలకు గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పి.నైనవరం గ్రామంలో ఇంజరపు బ్రహ్మానందం కుటుంబం నివాసం ఉంటుంది. ఇత్తడి బిందెలు తయారు చేసే కంపెనీలో పని చేస్తుంటాడు. సోమవారం మధ్యాహ్నం బ్రహ్మానందం తన తోడల్లుడు ఇద్దరు పిల్లలను వాంబేకాలనీలో దింపేందుకు బైక్‌పై బయలుదేరాడు. వైవీ.రావు రింగ్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బ్రహ్మానందంతో పాటు ఇద్దరు పిల్లలకు గాయాలు కాగా స్థానికులు ఆటోలో ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏఈవో దుర్గారావు ద్వారకా తిరుమలకు బదిలీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఏఈవో ఎం. దుర్గారావు ద్వారకా తిరుమల దేవస్థానానికి డెప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ టి.చంద్రకుమార్ ఆదేశాలు జారీ చేశారు. దుర్గగుడి నుంచి దుర్గారావు ద్వారకా తిరుమలకు బదిలీ కాగా, అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి వార్ల దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న బి.వెంకటరెడ్డిని దుర్గగుడికి డెప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు.

భగవద్గీతే శ్రీకృష్ణుని నిజ బోధ



కె.తాడేపల్లిలో ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రతినిధులు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): భగవద్గీతే శ్రీకృష్ణుని నిజ బోధ అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలో సోమవారం వారు ఇంటింటికి వెళ్లి త్రైత సిద్ధాంతం, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం తెలియజేస్తోందని, ప్రతి ఒక్కరూ కర్మ యోగ విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలనే ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ అధ్యక్షుడు జగీరప్పు సురేష్, సూరప్పుడు, ఉమా, జయ, నరసమ్మ, లక్ష్మి, యశోద, చంద్రబాబు, చెంచు, గౌరినాయుడు, సత్యం, సీతప్పుడు, లక్ష్మీభాయ్, పార్థు, భాగ్యశ్రీ పాల్గొన్నారు.


కొనసాగుతున్న యోగాంధ్ర కార్యక్రమాలు



కొండపల్లిలో యోగాసనాలు చేస్తున్న సచివాలయాల ఉద్యోగులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 11వ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని యోగాసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కొండపల్లి పరిధిలోని వివిధ సచివాలయ సిబ్బందికి యోగా గురువు లంకే జనార్దన్ సోమవారం యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక క్రమశిక్షణకు యోగా ఒక శాస్త్రీయమైన పద్ధతి అన్నారు. మనసును ఏకాగ్రత వైపు నడిపించే సాధనమే యోగా అని, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, ఆర్ఐ రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



మైలవరంలో లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మైలవరం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయని మైలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం.రవికుమార్ తెలిపారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు సోమవారం కథల పుస్తకాలు చదివించి, కథలు చెప్పించడం చేయించారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్ విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ టీ స్పూన్ ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



తహసీల్దార్ లక్ష్మీకళ్యాణికి వినతి పత్రం అందజేస్తున్న క్రైస్తవులు

విస్సన్నపేట: విస్సన్నపేట క్రిస్టియన్ ఫెలోషిప్ కింద క్రైస్తవులకు ప్రత్యేకంగా శ్మశానవాటికకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు చిన్ని విజయబాబు, కార్యదర్శి పచ్చిగోళ్ల జాషువా కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కె.లక్ష్మీకళ్యాణికి సోమవారం వినతి పత్రం అందజేశారు. తమకు శ్మశానవాటిక స్థలం లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు డి.ఏలియా, జాయింట్ సెక్రటరీ కె.జాన్ వెస్లీ, సభ్యులు పాల్గొన్నారు.

విత్తనాల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

సాక్షి స్పందన



దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ భవాని

జగ్గయ్యపేట: 'నకిలీ విత్తనాలతో జర జాగ్రత్త' శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి జగ్గయ్యపేట వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. ఏడీఏ భవానీ తన సిబ్బందితో కలిసి జగ్గయ్యపేటలో విత్తనాలు విక్రయించే పలు దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభం నేపథ్యంలో నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ఎమ్మార్పీకే విక్రయించాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రశీదులు అందించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో గుడ్డ సంచులలో విత్తనాలను అమ్మితే వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలని రైతులను కోరారు. విత్తనాలు విత్తే ముందు మొలకశాతం పరిశీలించుకోవాలన్నారు. జగ్గయ్యపేట మార్కెట్‌యార్డులోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో రైతులకు ఉచితంగా విత్తన పరీక్షలు చేస్తున్నందున, ఈసదుపాయాన్ని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సరిపడ విత్తనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం స్టాకు, తదితర రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో ఏవో వరలక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఓ ఇంటిపై ఏసీ రిపేర్ చేస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గాయాల పాలయ్యాడు. కొండపల్లి 10వ వార్డులో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు కొండపల్లి గ్రామానికి చెందిన యువకుడు హిదయతుల్లా ఏసీ మెకానిక్‌గా పని చేస్తాడు. ఓ ఇంటిపై ఏసీ రిపేర్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైయ్యాడు. ఇంటిపైన ఏసీ ఔటర్ పైపు పైకి తీస్తున్న క్రమంలో ఇంటి సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు పైపు తగలడం వలన ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అతని వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన సమీపంలోని వైద్యశాలకు తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాపాయం తప్పింది.

సారా, మద్యం విక్రేతల అరెస్ట్

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని విస్సన్నపేట మండలం కొర్రా తండాలో సారా తయారీకి సిద్ధం చేసిన 50 లీటర్ల బెల్లపుఊటను ఎక్సైజ్ అధికారులు సోమవారం ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న కొర్రా నాగేశ్వరరావును అరెస్ట్ చేసి తిరువూరు కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్ తెలిపారు. రాజుపేటలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న తోట హరీష్, ముప్పా సాంబశివరావు నుంచి 26 మద్యం సీసాలు స్వాధీనపరచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐలు వెంకటకుమార్, కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.